విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

శుక్రవారం 31, అక్టోబర్ - 2025 4 పేజీలు

టిడ్కో కాలనీలో సమస్యలకు అతి త్వరలో పరిష్కారం - ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

టిడ్కో కాలనీవాసులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

హాజరైన మంత్రి ఎండి ఫరూక్ , ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

విశాలాంధ్ర-కావలి : వర్షాలు కురిసినప్పుడల్లా మద్దూరుపాడు వద్దగల టిడ్కో కాలనీలో వరద నీరు చేరుతోందని, ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి తెలియజేశారు. మెంథా తుఫాను నేపథ్యంలో ఇటీవల కురిసిన 2 లో

తుఫాను బాధితులను తక్షణం ఆదుకోవాలి

- -చేనేత కార్మికులకు రూ.20వేలు , 25 కేజీల బియ్యం ఇవ్వాలి
- -నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సమస్యపై స్పందించాలి
- -సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్
- -తుఫాన్‌తో దెబ్బతిన్న ప్రాంతాలలో సీపీఐ బృందం పర్యటన

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు రూరల్ మండలంలో మొంథా తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి,సహాయ కార్యదర్శి నంది పోగు రమణయ్య జిల్లా కార్య వర్గసభ్యులు పి.మాలకొండయ్య రూరల్ మండలం సహాయకార్యదర్శి ఆదినారాయణ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లీలా మోహన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడుజిలాని ఖాన్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి విజయకుమార్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పముజుల హరి రూరల్ మండలం సిపిఐ సీనియర్ నాయకులు చల్లా నరసయ్య, కౌలు రైతుల సంఘం కార్యదర్శి రాజ గోపాల్ తల్లు సీనయ్య, శివయ్య, తదితరులు రూరల్ మండలంలోని తుఫాన్‌కు దెబ్బతిన్న ప్రాంతాలను పర్యటించారు. అందులో భాగంగా ములుమూడి కలుజు వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సిపిఐ బృందం ఆరా తీసింది. ప్రభుత్వం మాటలకు చేతలకు పొంతన లేదని ఆచరణలో మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదని అరిగేల సాయి ఆరోపించారు. శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఈ ఈ ప్రాంత ప్రజలు నన్ను ఎంతో ఆదరించి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. తప్పక ఈ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న బ్రిడ్జిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని మాటలు చెప్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం ఏమీ జరగలేదన్నారు.వెంటనే ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి ఈ 2 లో

మన జాతి వైభవానికి ఆలయాలు మూలాధారాలు

త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అనుగ్రహభాషణం

విశాలాంధ్ర బ్యూరోనెల్లూరు : మన జాతి వైభవానికి ఆలయాలు మూలాధారాలు.. పురాతన ఆలయాల ప్రాచీన చరిత్రను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పరమహంస, పరివ్రాజకాచార్యులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అనుగ్రహభాషణం చేశారు.బుధవారం నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవం శ్రీ చిన్నజీయరు స్వామి వారి స్వహస్తాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత హోమశాలలో ప్రత్యేక పూజల అనంతరం వేణుగోపాలస్వామి, ఉప ఆలయాల పునర్నిర్మాణానికి శంకుస్థాపన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణలు, అచంచలమైన భక్తివిశ్వాసాలతో ఆలయ శంకుస్థాపన మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ హరిజవహర్‌లాల్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు, ప్రముఖులు, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా భక్తజనాన్ని ఉద్దేశించి చిన్నజీయరు స్వామి అనుగ్రహభాషణం చేశారు. చిత్తశుద్ధి, మంచి సంకల్పం ఉంటే భగవంతుడు మన వెంట ఉంటాడు అనేందుకు గురువారం జరిగిన ఈ గొప్ప కార్యక్రమమే మంచి ఉదాహరణ అన్నారు. ఒక పక్క భయంకరమైన తుపాను వల్ల ఈ కార్యక్రమంపై అనేక సందేహాలు వచ్చాయని, మంత్రిఆనంరామనారాయణరెడ్డి సంకల్పం, భగవంతుడి కార్యక్రమం మంచిగా జరగాలనే అందరి తపన, చిత్తశుద్ధితోనే తుపాన్ గండం తొలగి దిగ్విజయంగా కార్యక్రమాన్ని భగవంతుడు చేయించాడని చెప్పారు. చిత్తశుద్ధి, మంచి సంకల్పానికి అంత శక్తి ఉంటుందని భక్తులకు ఉపదేశించారు. భారతదేశం మొత్తం మీద తెలుగువారికి ఉన్న చరిత్ర మరెవ్వరికీలేదన్నారు. ఆహారంలోనూ.. విహారంలోనూ.. వ్యవహారంలోనూ తెలుగువాడి చరిత్ర గొప్పదన్నారు.తమిళనాడులోని శ్రీరంగం, మధురై పురాతన ఆలయాల్లో ఇప్పటికీ మన తెలుగు లిపి కనిపిస్తుందన్నారు. మన 2 లో

రావుల లక్ష్మి, చిరస్మరణీయురాలు : సిపిఐ నాయకురాలు అరుణ

విశాలాంధ్ర-కందుకూరు: కమ్యూనిస్టు భావజాలంతో భర్త అడుగుజాడల్లో నడుస్తూ తాను ఉన్నంతవరకు అదే బాటలో నడిచిన రావుల లక్ష్మి చిరస్మరణీయురాలని మాజీ సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి న్యాయవాది కాట్రగడ్డ అరుణ అన్నారు. ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య సతీమణి రావుల లక్ష్మి 16వ వర్ధంతి గురువారం వెంకయ్య నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ వెంకయ్య కందుకూరు నుండి ఢిల్లీ స్థాయి వరకు నేతగా ఎదగటానికి వెనుక ఉండి నడిపించిన వ్యక్తి లక్ష్మి అని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమాలతో పెన వేసుకున్న కమ్యూనిస్టుల ప్రయాణం సజావుగా సాగాలంటే కుటుంబంలో స్త్రీ పాత్ర చాలా కీలకమైనదని ఆమె అన్నారు. కమ్యూనిస్టు ప్రయాణంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కుటుంబ బాధ్యతలు మోయటంలో స్త్రీలు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నేతలు మాట్లాడుతూ వెంకయ్య జాతీయస్థాయి నాయకుడిగా ఎదగటానికి గృహిణిగా లక్ష్మీ పాత్ర ఎంతో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాష్ రావు డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు కందుకూరు నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి భూసి సురేష్ బాబు సహాయ కార్యదర్శి పి బాలకోటయ్య ఏఐటియుసి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వై ఆనందమోహన్ ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు దుర్గాప్రసాద్ చంద్రమోహన్ మాజీ రైతు సంఘం నాయకులు వలేటి అక్కయ్య తోకల వెంకటేశ్వర్లు బాల బ్రహ్మచారి ఎం లక్ష్మీనారాయణ రావుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, నేతల సమన్వయం హర్షణీయం : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: తుఫాను తీవ్రతపై సీఎం చంద్రబాబు నాయుడు నిరంతర పర్యవేక్షణ చేస్తూ అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం వల్లే ఆస్థి, ప్రాణ నష్టాలను నివారించగలిగామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఇందుకూరు పేట మండల కేంద్రంలో మంథా తుఫానుకారణంగా ఉపాధికోల్పో యిన మత్స్యకార సోదరులకు ఆమె నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాం తి రెడ్డి మాట్లాడుతూ మత్స్యకార సోదరు లకు ప్రభుత్వం తక్షణ సహాయంగా 50 కిలోల బియ్యంతో పాటు 1 కిలో కందిపప్పు, 1 కేజీ పామాయిల్, కిలో ఉల్ల గడ్డలు, కిలో ఎర్రగడ్డలు అందచేసింద న్నారు. ముంపు ప్రాంత వాసులను పున రావాస కేంద్రాలకు తరలించి అధికారు లతో కలిసి సహాయక చర్యలలో పాల్గొన్న టిడిపి, కూటమి పార్టీ నాయకులను ఆమె అభినందించారు. నిత్యం అందుబాటులో వుంటూ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు ఏ ఇబ్బంది రాకుండా కంటికి రెప్పలా కాపాడిన రెవెన్యూ, పోలీస్ మరియు వైద్య శాఖాధికారుల పనితీరును ఆమెప్రశంసించారు.చంద్రబాబుప్రేరణతో తుఫాను సహాయక బాధ్యతను తమ భూజాల కెత్తుకొని సహాయక శిబిరాలలో వుంటున్న 2 లో

తుఫాను బాధితులను తక్షణం ఆదుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతానికి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అనంతరం ఆయన సౌత్ మోపూర్ గ్రామంలోని చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వారు పడుతున్న ఇబ్బందులను మగ్గాల గుంటలలో నీళ్లు రావడంతో పనులు లేక అవస్థలు పడుతున్నారని మరో 20 రోజుల వరకు వారు పని చేసుకునే పరిస్థితి లేదన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం తక్షణం సాయంగా చేనేత కార్మికులకు రూ.20వేలు ఆర్థిక సాయం, 25 కేజీల బియ్యాన్ని నిత్యవసర సరుకులను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరాశ్రయులు కందమూరు,పోట్టేపాలెం గ్రామాలలో ఇప్పటికీ పునరావాస కేంద్రాలలో ఉన్నారని తెలిపారు.నారుమళ్లు దెబ్బతిన్న రైతులకఉచితంగా విత్తనాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూరు తదితర గ్రామాలలో నుంచి పలువురు మహిళలు రైతులు చేనేత కార్మికులు సిపిఐ బృందానికి తమ సమస్యలు తెలియజేశారు.

టిడ్కో కాలనీలో సమస్యలకు అతి త్వరలో పరిష్కారం - ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షాలకు టిడ్కో కాలనీ ముంపుకు గురవటంతో అక్కడ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రభుత్వం అందించిన నిత్యవసర వస్తువులను గురువారం కాలనీవాసులకు నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి మంత్రి ఎండి ఫరూక్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ తుఫాను సమయంలో కాలనీ వాసుల కష్టాలను తాను స్వయంగా చూశానని చెప్పారు. వెంటనే ఆహారం, తాగునీరు అందించినట్లు గుర్తుచేశారు. కొద్ది గంటల్లోనే విద్యుత్ సరఫరా కూడా పునరుద్ధరిస్తామని చెప్పారు.బ్యాక్ వాటర్ కాలనీలోకి వస్తోందన్నారు. ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఇప్పటికే మున్సిపల్ శాఖ మంత్రికి ప్రతిపాదనలు అందించినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. అటవీ భూములతోపాటు రైల్వే ట్రాక్ ప్రాంతాల నుంచి వరద నీరు కూడా కాలనీలోకే వస్తోందన్నారు. ఈ మూడు పనులకు ప్రతిపాదన తయారు చేసి పంపామని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బిజెపి, జనసేన నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు, నేతల సమన్వయం హర్షణీయం : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

బాధితులకు భోజనం, చిన్న పిల్లలకు పాలు అందించన నాయకులు, కార్యకర్తలు ముందు ముందు యిదే స్ఫూర్తితో పని చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపికృష్ణ, ఎంపీడీఓ నాగేంద్ర బాబు, జెడ్ పి వైస్ ఛైర్మెన్ శ్రీహరికోట విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, వెస్ట్ పాళెం పెద్ద కాపు ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ఈస్ట్ పాళెం పెద్దకాపు శ్రీహరి శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు పామంజి నరసింహ, ఊటుకూరు రాజ, ముక్కంటి చంద్ర, కటారి బాబు, అంగేరి మల్లయ్య, ముక్కంటి అంకయ్య, వైస్ ప్రెసిడెంట్ ఊటుకూరు ప్రసాద్, వియ్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం చేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు : ఎస్ఐ మరిడి నాయుడు

విశాలాంధ్ర-వలేటివారిపాలెం :మద్యం సేవించి వాహనాలు నడపరాదని, బాధ్యత కలిగిన వారుగా వాహనాన్ని నడిపి ప్రమాద రహితంగా నిలవాలని వలేటివారిపాలెం ఎస్ ఐ మరిడి నాయుడు అన్నారు.గురువారం సాయంత్రం కూనిపాలెం టోల్ గెట్ దగ్గర వాహనాలను తనిఖీ చేశారు హెల్మెట్, లైసెన్స్, వాహనాలకు సరియైన పత్రాలు లేనివారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మరిడి నాయుడు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు, వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని అన్నారు. మైనర్ల కు వాహనాలను ఇవ్వ రాదని అన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డ్రైవింగ్ సమయంలో తమ కుటుంబాలను గుర్తుంచుకోవాలని, బాధ్యతాయుతంగా క్రమశిక్షణతో డ్రైవింగ్ చేయడం వలన రోడ్డు ప్రమాదాలు చాలా వరకు నివారించవచ్చునని ఆయన చూచించారు. డ్రైవింగ్ చేసే టప్పుడు వాహనం ముందు దేవుడు ఫొటో కన్న మీ కుటుంబ సభ్యుల ఫొటో ఉంచుకోవడం శ్రేయస్కరం అని ఆయన చూచించారు.అనంతరం రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బ్రహ్మయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు మూలాధారాలు

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రను మనం సంరక్షించుకోవాలన్నారు. తెలుగువారి చరిత్రకు ఆలయాలే మూలాధామన్నారు. ఆలయాల సుందరీకరణ తప్పు కాదని, అయితే ఆలయాల ప్రాచీనత దెబ్బతినకూడదన్నారు. ఆలయాల చరిత్ర కనుమరుగు కాకుండా ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. పురాతన శిలాశాసనాలు, శిలా ఫలకాలు, వస్తుసామగ్రిని అలాగే ఉంచి మన చరిత్రకు సాక్ష్యాలుగా రేపటి తరాలకు అందించాలన్నారు. పూర్వీకులు మనకు అందించిన వేల సంవత్సరాల చరిత్ర పరంపరను కొనసాగిస్తూ ఆలయాలకు వైభవం తీసుకురావాలని సూచించారు. ఎంతో గొప్ప ప్రాశస్త్యం గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి గత పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ అధికారులు ఎంతో కృషి చేస్తున్నారని, భక్తులు కూడా ఈ మహత్కార్యంలో భాగస్వాములు కావాలని చిన్న జీయర్ స్వామి పిలుపునిచ్చారు. ఐదు కుటుంబాల నుంచి వంశపారంపర్యంగా వస్తున్న ట్రస్టుబోర్డు సభ్యులు ఆలయ పవిత్రతను కాపాడాలనే సంకల్పంతోపెద్దలవారసత్వాన్ని కొనసాగించాలనే ఆలోచన చేయడం సంతోషకరమన్నారు. నెల్లూరు శాసనసభ్యులు దివంగత ఆనం వివేకానంద రెడ్డి పెద్ద కుమారుడు ఆనం చెంచుసుబ్బారెడ్డి కూడా ట్రస్టుబోర్డులో సభ్యుడిగా చేరడంతో ట్రస్టుబోర్డుకు పరిపూర్ణత చేకూరిందన్నారు. ట్రస్టుబోర్డు సభ్యులు, అర్చకులు ఆలయ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలన్నారు.

18నెలల్లోనే ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి:

మంత్రిఆనంరామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 27వేల ఆలయాల బాధ్యతను సీఎం చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో అప్పగించారని, ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఎంతో చరిత్ర, ప్రాశస్త్యం గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గతంలో వందలాది కల్యాణాలు జరిగేవని, భక్తులతో ఆలయం కళకళలాడేదని మంత్రి గుర్తుచేశారు. అయితే కాలక్రమంగా ఆలయ శక్తి తగ్గడంతో చిన్నజీయరు స్వామి సూచనల మేరకు ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రాష్ట్రప్రభుత్వం రూ.17 కోట్ల నిధులను మంజూరుచేసినట్లు చెప్పారు. ఆలయ పవిత్రత దెబ్బతినకుండా ఖర్చుకు వెనకాడకుండా ఆలయ గర్భాలయం, అంతరాలయం, రాజగోపురం, అన్వేటి మండ పం నిర్మాణాలను రాతి కట్టడాలతోనే నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఆలయాలపునర్నిర్మాణాలను రాతికట్టడాలతోనే నిర్మిస్తామని, ఇందుకు వేణుగోపాల స్వామి ఆలయం నుంచే శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి చెప్పారు.వేణుగోపాలస్వామి ఆలయం నుంచే దళితుల ప్రవేశం జరిగిందన్నారు. ఆనాటి జ్ఞాపకాలను, ఆలయంలో ఉన్న పురాతన శిలాఫలకాలను సముచిత గౌరవంతో తిరిగి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఐదుగురు సభ్యులతో ట్రస్టుబోర్డు ఉండాల్సి ఉండగా, ఒకస్థానంగా ఖాళీగాఉండడంతో ఆనం వివేకానందరెడ్డి పెద్దకుమారుడు ఆనం చెంచుసుబ్బారెడ్డి ట్రస్ట్ సభ్యుడుగా గురువారం ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించినట్లు మంత్రి చెప్పారు. ఆలయ నిర్మాణానికి రెండేళ్లు కాలం ఉన్నప్పటికీ 18నెలల్లోనే అద్భుతంగా నిర్మాణాలను పూర్తి చేసి ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణం పూర్తయిన వెంటనే మహాకుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను కూడా చిన్నజీయరు స్వామి స్వహస్తములతో నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. సర్వాంగసుందరంగా ప్రాచీన వైభవానికి తగినట్లుగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. తొలుత వేణుగోపాలస్వామి ఆలయ విశిష్టతపై రూపొందించిన పుస్తకాన్ని చిన్న జీయర్ స్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

పొదలకూరు లో ఘనంగా కోటి సోమవారం వేడుకలు

విశాలాంధ్ర - పొదలకూరు : పొదలకూరు పట్టణంలోని కామాక్షితాయి రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం కోటి సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయానికి చేరుకుని దీపాలను వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వార్లను దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు పీబీఎస్వీ ప్రసాద స్వామి, అర్చకులు కుమారస్వామి లు పూజా కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా ప్రసాద స్వామి మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో వచ్చే సోమవారాలు ఎంతో విశిష్టమైనవిగా భావిస్తారన్నారు. ముఖ్యంగా కార్తీక మాసంలో కోటి సోమవారం రోజుకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు ఈ రోజున చేసే శివకేశుల పూజకు, ఉపవాసాని,కి దానాలకు రెట్టింపు ఫలితాలు ఉంటాయని శాస్త్ర వచనం చెబుతోందన్నారు.

తుపాను బాధితులకు బియ్యం,నిత్యావసర వస్తువులు పంపిణీ

విశాలాంధ్ర - పొదలకూరు : మొంథా తుపాను బాధితులకు సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని నావూరు పల్లి గిరిజన కాలనీ వాసులకు పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు.మస్తాన్ బాబు ఆధ్వర్యంలో మొంథా తుఫాను కారణంగా నిరాశ్రయులైన వారికి, పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి ఒక్కో కుటుంబానికి బియ్యం -25 కేజీలు, కందిపప్పు -1 కేజీ, చక్కెర -1 కేజీ, పామాయిల్ -1 లీ, బంగాళ దుంపలు -1 కేజీ, ఆనియన్స్ -1కేజీ చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. వీటితోపాటు దుప్పట్లు కూడా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి. శివ కృష్ణయ్య, టీడీపీ నాయకులు అలుపూరు శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే పొదలకూరు పట్టణంలోని శివాలయం వీధి, పాముల వీధి, శ్రామిక నగర్ లోని తుపాను బాధితులకు వారికి పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు ఆధ్వర్యంలో బియ్యం నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ రైతు సంఘం నాయకులు బక్కయ్య నాయుడు, వీఆర్ఓ నాగమ్మ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తుఫానుప్రభావిత గ్రామాలలో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి-దళితసంఘర్షణసమితి

విశాలాంధ్ర-చిట్రగుంట: తుఫాన్ వలన గ్రామాలలో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు గురువారం బోగోలు తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ ఇటీవల కురిసిన మెంత తుఫాన్‌వలనమండలకార్యాలయానికికూతవేటుదూరంలోనిరామాపురం ఎస్టీ కాలనీపలుదళితకాలనీలు వర్షపు నీరుచేరడం వలనరాకపోకలకు అసౌకర్యంగా ఉందని తెలియజేశారు. చంద్రబాబు ప్రభుత్వం తుఫాను బాధితులకు 3000 రూపాయల డబ్బులు సరుకులు ఇవ్వమన్నా ఇప్పటివరకు ఆ ఊసే లేదని తెలియజేశారు కోవూరు పల్లి పంచాయితీ అంబేద్కర్ నగర్లో ప్రసాద్ ఇంటి నుంచి రియల్ ఎస్టేట్ వారు చుట్టూ గోడ కట్టినందువలన వర్షపు నీరు పోయే పరిస్థితి లేక గ్రామాలలో వర్షపు నీరు నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు సత్యవతమ్మ ఎన్జీవో పొట్లూరు కీర్తి స్థానిక నాయకులు ఆత్మకూరు మోహన్ రావు ప్రసాద్ జడ్డా వాసు, తేజ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించండి :కమిషనర్ వై.ఓ నందన్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు :వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పారిశుద్ధ్యనిర్వహణ ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు వర్షంలో తడిసినందువల్ల జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని కమిషనర్ వై.ఓ నందన్ బుధవారంఒక ప్రకటనలో తెలియజేశారు. సీజనల్ వ్యాధులపట్ల సమాచారం, చికిత్స, వివరాల కోసం 0861-2316777 నెంబరులో సహాయ సిబ్బందిని 24 గంటలపాటు అందుబాటులో ఉంచామని, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం అంశాలపై సమస్యలకోసం 0861-2356777 నెంబరు ద్వారా సహాయాన్ని అందించేందుకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో హెల్ప్ లైన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గిరిజనుల స్థితిగతులను తెలుసుకున్న బొబ్బేపల్లి

విశాలాంధ్ర-ముత్తుకూరు : తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కారణంగా ముత్తుకూరు కట్టకింద గిరిజన కాలనీ వాసులు ఏ విధంగా వర్షాల్లో ఇబ్బందులు పడ్డారని జనసేన సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త బొప్పేపల్లి సురేష్ నాయుడు గురువారం కాలనీకి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. గిరిజన కాలనీలో మొందా తుఫాన్ కారణంగా నీళ్లు నిలబడిపోయి ఆ నీళ్లు బయటకు వెళ్లే దానికి మార్గం లేక ఆ నీళ్ళలో పాముల తిరుగుతూ గిరిజనులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎంపీడీవోకు తెలియజేశారు. గిరిజనులకి అండగా ఏ ఇబ్బంది వచ్చినా మేము సైతం అంటూ అందుబాటులో ఉండి వారికి అన్ని విధాల ఆదుకునే దానికి మా వంతు మేము కృషి చేస్తామని ఆయన తెలిపారు. అలాగే స్థానిక శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా తుఫాన్ కారణంగా మూడు రోజులు పాటు 117 పంచాయతీల్లో కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరుమండల సీనియర్ నాయకులు రహీం, సందూరి శ్రీహరి, జెడ్డా చిన్న, దబ్బి సతీష్, కుడుమల రాణమ్మ, కత్తి చారుముడి, కత్తి నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక బస్సులు

విశాలాంధ్ర-కావలి :కార్తీకమాసం సందర్బంగా ఆదివారం, నవంబర్ 2 వ తేదీన ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎపియస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ డి ఆదినారాయణ తెలిపారు. ఆదివారం ప్రముఖ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, అరుణాచలం, పంచారామాలకు స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామని ఆయన అన్నారు. శ్రీశైలంకు అల్ట్రా డీలక్స్ బస్సు ఉదయం 10.30 గంటలకు కావలిలో బయలుదేరుతుందని, ఈ బస్సుకు టికెట్ ఛార్జ్ రూ.535(ఒక వైపు) మాత్రమే అని, అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 8.00 గంటలకు బయలు దేరుతుందని, ఛార్జ్ 1400 రూపాయలు (పోను - రాను) అని, పంచారామం క్షేత్రాలైన అమరారామం, సోమరామం, క్షీరారామం, ద్రాక్షారామం, కుమారారామంలకు సూపర్ లగ్జరీ బస్సు రాత్రి 10.00 గంటలకు బయలు దేరుతుందని, ఛార్జి 2300 రూపాయలు (పోను - రాను) అని ఆయన తెలిపారు. పై సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించామని, కావున భక్తులు, పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ బస్సు సౌకర్యాలను ఉపయోగించుకుని, తమకు ఇష్టమైన శైవ క్షేత్రాలకు సురక్షి తంగా, సౌకర్యావంతంగా దర్శించుకుని రావాలని డియం డి ఆదినారాయణ కోరారు. ఇతర వివరాలకు 7382925413 (విచారణ), 9493913989 (బస్టేషన్ మేనేజర్), 9966009395 (అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) లను సంప్రదించాలని ఆయన వివరించారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర-ముత్తుకూరు :ఈనెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన వ్యాస రూప, వక్తృత్వ,క్విజ్ పోటీల నుండి ప్రధమ, ద్వితీయ, తృతీయ విజేతులైనటువంటి విద్యార్థులకు మండల స్థాయిలో గురువారం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ కు సంబంధించినటువంటి అంశాలలో పోటీలు నిర్వహించడమైనది. అనంతరం వ్యాసరచన పోటీలలో మొదటి మూడు స్థానంలో వచ్చిన వారికి , వక్తత్వ పోటీలలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన వారికి మొత్తం 6 మందికి క్విజ్ నిర్వహించడం జరిగింది. దీనిలో మొదటి మూడు స్థానాలలో జాస్మి, మహేశ్వరి,పూజిత, నియోజకవర్గ పరిధిలో జరిగే పోటీలకు పంపడం జరుగుతుందన్నారు.ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో వచ్చిన విద్యార్థులను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందించారు.

సోమిరెడ్డి సహకారంతోనే సంగం బ్యారేజీలో బోటు వెలికితీత

విశాలాంధ్ర-ముత్తుకూరు : సంగం బ్యారేజీ వద్ద తుఫాన్ కారణంగా 30 టన్నుల తో ఉన్న పంటి అనగా బోటు గ్యారేజీకి ఇబ్బంది కలిగించే విధంగా ఉండడంతో సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశానుసారం స్థానిక కృష్ణపట్నం పోర్ట్ ఎస్సై శ్రీనివాసులు రెడ్డి, మత్స శాఖల సహకారంతో కృష్ణపట్నం పోర్టు నుండి రెండు బోట్లను తీసుకొని వెళ్లి ఆ పంటిని బ్యారేజీకి ఇబ్బందులు లేకుండా బయటకు తీసుకొచ్చినట్లు మత్స్యకార సంఘం సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షులు అక్కయ్య గారి ఏడుకొండలు తెలిపారు. గురువారం పని పూర్తయ్యాక ముత్తుకూరుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ పంటిని అనగా ఇసుకతో ఉన్న బోటును బయటికి తీసుకుని వచ్చేందుకు తమ గ్రామం నుండి 20 మంది మసకారులను తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. మత్స్యకారులందరూ సమిష్టిగా పనిచేయడం వల్ల, అధికార యంత్రాంగం సహకారంతో త్వరితగతిన దానిని బయటకు తీసుకొని రావడం జరిగిందన్నారు. అందుకుగాను డి.ఎస్.పి, సీఐ వేమారెడ్డి, తాసిల్దార్ సోమ్లా నాయక్, ఎంపీడీవో పావని లు తమను పూలమాలలతో, శాలువాలు కప్పి అభినందించారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మాకు కల్పించినటువంటి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ :ఎమ్మెల్యే ఇంటూరి

విశాలాంధ్ర-కందుకూరు:కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీతో కలిసి గురువారం మెంథా తుఫాన్ ప్రభావంతో వరదలకు గురైన కందుకూరు పట్టణ ప్రజలకు పట్టణంలోని మూడో నెంబర్ రేషన్ షాప్ వద్ద తుఫాను బాధితులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారీ తుఫాన్ సంభవించినప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందస్తు చర్యలతో ఎక్కువ మొత్తంలో నష్టం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాల్లో మూడు పూటల భోజనం, వైద్య సదుపాయాలు కల్పించారు. ఇప్పుడు వారు తిరిగి గృహాలకు చేరిన తర్వాత, వారి అవసరాల కోసం నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న తుఫాను బాధిత ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం తోపాటు ఐదు రకాల నిత్యావసర వస్తువులు అందజేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. అనూష, తహసిల్దార్ లావణ్య, ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

"విజిలెన్సు అవేర్నెస్ వీక్ - 2025" అవగాహనా సదస్సు

విశాలాంధ్ర-కావలి :పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ కావలి పురపాలక సంఘ సమావేశ మందిరంలో అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ. శ్రీహరి రావు, తహసిల్దార్ కృష్ణ ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట రెడ్డి లు ప్రసంగించారు. అనంతరం సిబ్బంది చేత విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించి, కొన్ని నినాదాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనరు జి. శ్రావణ్ కుమార్, మేనేజరు పి.ఫణి కుమార్, మునిసిపల్ సిబ్బంది మరియు వార్డు సచివాలయాల పరిపాలనా కార్యదర్శులు, వార్డు మహిళా సంరక్షణా కార్యదర్శులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి : బుర్రా

విశాలాంధ్ర-కందుకూరు:మొంథా తుఫాను నేపథ్యంలో గత మూడు రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు రైతుల పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ శాసన సభ్యులు కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంట పొలాలను అధికారులు క్షేత్ర స్థాయి లో పర్యటించి నిష్పక్షపాతంగా పంట నష్టం సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించాలని దానితోపాటు సబ్సిడీ కింద విత్తనాలు ఎరువులను కూడా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

24వ వార్డు వైసిపి అధ్యక్షునిగా ఉప్పుటూరి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-కందుకూరు:రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో 24వ వార్డులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆ వార్డు లోని ప్రజలకు మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే కలిగే నష్టాలను గురించి వివరిస్తూ, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వారి నుంచి సంతకాలు సేకరించారు. అనంతరం 24వ వార్డ్ అధ్యక్షులుగా ఉప్పుటూరి నాగేశ్వరరావు ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ,రాష్ట్ర బూత్ కమిటీ సభ్యులు గణేశం గంగిరెడ్డి,జిల్లా ఇంటలెక్చువల్ అధ్యక్షులు రావులకొల్లు బ్రహ్మానందం, జిల్లా మున్సిపల్ సెక్రెటరీ నగల్ల నారయ్య, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు యారమాల నాగభూషణం, తల్లపనేని గోపి,షేక్ రహీం, కానాల శివప్రసాద్, పేయ్యల రమణయ్య, సంఘ ప్రసాదు,శ్రీరామ కుమారస్వామి,జిల్లెళ్ళమూడి కోటేశ్వరరావు, ఉప్పుటూరి మాలకొండయ్య, నిడమనూరి రమేష్ , జంగిలి ప్రభుదేవా, ఆలూరి సుందర్రావు, కావూరి కోటేశ్వరరావు, మల్లిబోయిన శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్ వాసులను పరామర్శించిన సిపిఐ నేతలు

విశాలాంధ్ర-ఆత్మకూరు:పట్టణంలోని శాంతినగర్ వాసులను సిపిఐ నాయకులు పరామర్శించారు. శాంతినగర్ వాసులతో సిపిఐ నాయకులు మాట్లాడుతూ తుఫాను వలన నష్టపోయిన మీ అందరికీ ప్రభుత్వం ద్వారా వచ్చేటువంటి ఆర్థిక సహాయాన్ని, వంట సామాగ్రిని మీ అందరికీ అందేలా చేస్తామని వారు అన్నారు. అంతేకాక మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్ననూ మీకు ఎల్లప్పుడూ మేము అందుబాటులో ఉంటామని వారు భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి జంగం నాగరాజు,సిపిఐ నాయకులు జె. మాలకొండయ్య, ఎం.రమణయ్య, మల్లిక,పోలయ్య, యన్. కొండయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకుంటాం : జిల్లా చేనేత జౌళి శాఖ ఏడిఓ

విశాలాంధ్ర-పొదలకూరు:మండలంలోని తోడేరు పంచాయతీ పరిధిలోని వీవర్స్ కాలనీలో వర్షాలకు నీళ్లు చేరిన మగ్గం గుంతలను గురువారం నెల్లూరు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ అభివృద్ధి డి. రజినీ కుమారి పరిశీలించారు. మగ్గం గుంతల్లోకి నీరు వచ్చిన ఇళ్లు అన్నింటిని ఆమె సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి నియోజకవర్గం వైసీపి చేనేత విభాగం అధ్యక్షులు పముజుల శంకరయ్య తో పాటు చేనేత కార్మికులు కలిసి న్యాయం చేయాలంటూ ఆమెకు వినతి పత్రం అందజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితిని తమ శాఖ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు బాధితులకు న్యాయం జరిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

1న విద్యార్థులకు భారత రాజ్యాంగ పోటీలు

విశాలాంధ్ర-ఉదయగిరి:స్థానిక ఆల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవంబర్ 1న ఉదయం 9.30 గంటలకు భారత రాజ్యాంగంపై విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని మండల విద్యాధికారి టి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను ఆ పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయుని కానీ ఉపాధ్యాయుడు మండల స్థాయి రాజ్యాంగ పోటీలకు విద్యార్థులను తీసుకురావాలని కోరారు.

పోకూరులో ముమ్మరంగా పారిశుధ్యపనులు

విశాలాంధ్ర-వలేటివారిపాలెం :పోకూరు పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్యపనులు చేపట్టారు. ఎంపీడీఓ వై.శంకరరావు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాని విధులన్నీ బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా ఓహెచ్ఎస్ ట్యాక్ లు నందు క్లోరినేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్ డి నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ ఎం, క్లాక్ మిత్రాలు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ మోపూర్‌కు హెల్పర్‌ను నియమించాలని

సబ్ స్టేషన్ ఎదుట సీపీఐ ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామానికి చెందిన సబ్ స్టేషన్ పరిధిలో హెల్పర్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో హెల్పర్ లేకపోవడంతో సౌత్ మోపూర్ గ్రామంతో పాటు పక్క గ్రామాలలో కూడా పలు ఇబ్బందులుఎదుర్కొంటున్నారన్నారు. 1500 కుటుంబాలు8వేలకు పైగా లకు పైగా జనాభా ఉన్నటువంటి సౌత్ మోపూర్ గ్రామానికి గత రెండున్నర సంవత్సరాలుగా హెల్పర్ లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన వారు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై రూరల్ శాసనసభ్యులు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని తక్షణం ఈ ప్రాంతానికి అవసరమైన హెల్పర్ను నియమించేందుకు అధికారులను ఆదేశించాలని అరిగెలసాయి డిమాండ్ చేశారు. 30 రోజులలోపుగా ఏర్పాటు చేయాలని కాని పక్షంలో సీపీఐ నెల్లూరు రూరల్ మండలం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడం జరుగుతుందని ప్రభుత్వాన్ని అరిగెల సాయి హెచ్చరించారు. సిపిఐ సీనియర్ నాయకులు పముజుల దశరథ రామయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతానికి విద్యుత్ సబ్ స్టేషననిర్మించేందుకు పది లక్షల రూపాయలు ఖర్చు చేసి ఒక కిలోమీటర్ నుంచి పైప్ లైన్ ద్వారా నీటిని సరఫరా చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా నరసింహులు కొండపైన ప్రత్యేకంగా రెండు గాలి మరలను ఏర్పాటు చేసి తద్వారా విద్యుత్ తీసుకునేందుకు గ్రామస్తులంతా దాదాపు పది లక్షల రూపాయలు మేరకు ఆరోజు నిధులు అందించారన్నారు. దీనిపైన విద్యుత్ అధికారులు తక్షణం స్పందించి గ్రామానికి హెల్పర్ను ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాలకు దెబ్బతిన్న వీధి దీపాలన్నీ తక్షణం మరమ్మతులు చేయాలని దశరథరామయ్య ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ రూరల్ మండల సహాయ కార్యదర్శి ఆదినారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఈ సమస్యపై తక్షణం స్పందిస్తానని మీకు తగిన సాయం చేస్తానని హామీ ఇచ్చారు, ఆతరువాత ఆయన పార్టీ మారడం తిరిగి ఎమ్మెల్యే అయినా గాని ఈ రోజు వరకు మాసమస్యను పరిష్కరించ లేదని వాపోయారు. శాసనసభ్యులు విద్యుత్ శాఖ అధికారులు తక్షణం స్పందించి ఈ ప్రాంతానికి హెల్పర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టకు ముందు చెప్పే మాటలకు తర్వాతే మాటలకు పొంతన లేదన్నారు. పేద ప్రజలకు అవసరమైన పనులను తక్షణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి మాలకొండయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పముజల హరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిల్లాని ఖాన్ ఖాన్,వ్యవసాయ కార్మిక సంఘంజిల్లాఅధ్యక్షులు లీలామోహన్, సౌత్ మోపూర్ ఉప సర్పంచ్ చల్లనరసయ్య, సౌత్ మోపూరు సిపిఐ శాఖ కార్యదర్శి రాజగోపాల్ ,నెల్లూరు రూరల్ మండల సిపిఐ కార్యకర్తలు నాగరత్నం, బాలయ్య,డప్పు కళాకారుడు తల్లుసీనయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్ స్టేషన్‌అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం..సీఐ వెంకట్రావు

విశాలాంధ్ర-ఉదయగిరి : జాతీయ పోలీస్ సంస్కరణ ఐక్యత దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక సీఐ వెంకట్రావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు శుక్రవారం ఉదయం 7 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని అన్నారు ఈ కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల కావలి ఎస్‌డిపి ఓ శ్రీధర్ ఆధ్వర్యంలో జరుగునని తెలిపారు

అతి కష్టం మీద బోట్లను గట్టుకు చేర్చిన అధికారయంత్రాంగం

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గం లో గత ఐదు రోజులుగా కురిసిన అధిక వర్షాలకు సంగం బ్యారేజ్ సమీపంలో నిలిపి ఉన్న మూడు బోట్లు వాటి తాళ్లు తెగిపోయి బ్యారేజ్ వైపుకు కొట్టుకుపోయాయి.అలా నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చిన మూడు బోట్లు బ్యారేజ్ సమీపంలో ఆనకట్ట వద్ద నిలిచిపోగా అవి అక్కడినుండి బ్యారేజ్ వైపుకు వెళ్ళితే బ్యారేజ్ కు ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందని వీటిని తొలగించమని స్థానికులు, అధికారులకు సమాచారం ఇవ్వగా ఆ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా మరియు జిల్లా ఎస్పీ అజిత వెజండ్ల ఇక్కడికి చేరుకొని బోట్లను పరిశీలించి వెంటనే ఇక్కడి నుండి వీటిని తొలగించమని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో నిన్న సాయంత్రం నుండి వీటిని తొలగించేందుకు అధి కారులు ప్రయత్నాలు ప్రారంభించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి ఒక బోటును ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను డివిజన్ పరిధిలోని ఫైర్, ఇతర సహాయక బృందాలను ఇక్కడికి తరలించారు.అధికారులు రాత్రి నుండి ఈ బోటును తొలగించేందుకు విశ్వ ప్రయత్నాలు చేసి గురువారం ఉదయం 11 గంటలకు అతి కష్టం మీద ఇరుక్కున్న ప్రాంతం నుంచి బోటును బయటికి తీసీ సురక్షిత ప్రాంతానికి తరలించారు. అధికారులు మీడియాతో మాట్లాడుతూ మరో సారి ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామని వారు అన్నారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ సూచనలతో డివిజన్ పరిధిలోని డిఎస్పి సీఐలు ఎస్సైలు పూర్తి పోలీస్ సిబ్బంది, ఫైర్, రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది తీవ్రంగా శ్రమించి ఈ ఆపరేషన్ సక్సెస్ చేయడంపై వారికి ఆర్డీఓ ధన్యవాదాలు తెలిపారు. బ్యారేజ్‌కు ఇబ్బంది కలగకుండా బోట్లను బయటికి తీయడంపై స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకొని అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పావని, డిఎస్‌పి వేణుగోపాల్, సోమశిల ప్రాజెక్టు ఛైర్మన్ కేశవ చౌదరి, సంగం మండల అధ్యక్షుడు బాణా శ్రీనివాసులు రెడ్డి,సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర-ముత్తుకూరు : తుఫాన్ కారణంగా మన లోని గ్రామాలలో నిలిచిపోయిన నేలను తొలగించడం, అలాగే బ్లీచింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఎంఎడీవో నాగమణి తెలిపారు. గురువారం ఆమె డిఎల్‌డిఓ వసుమతితో కలిసి మనల్ని పంచాయతీలలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సమీక్షించారు. వర్షాలు పడి ఆగిపోయాక పారిశుధ్య పనులను వర్తి గతంలో చేపట్టకపోతే సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందని అందువల్ల ముందు చర్యక గ్రామాల్లోని వీధులలో డ్రైనేజీ కాలువలలో వరదనీరు వెళ్లేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. విశాఖపట్నం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, బండపల్లిలో జరిగిన కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి చలపతి, ముత్తుకూరులో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిఖామణి, పో ట్టెంపాడు లో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసులు, పిడతా పోలూరులో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేషగిరి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. మిగిలిన పంచాయతీలలో కూడా పారిశుధ్య పనులు జరిగినట్టు ఎంపీడీవో తెలిపారు.

మనుబోలులో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర -మనుబోలు: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పంచాయతీరాజ్ కమిషనర్ సీఈఓ, డిపిఓ,ఎంపీడీవో, ఆదేశాల మేరకు మనుబోలులో పంచాయతీ కార్యదర్శి గరుడయ్య గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలను తీసుకున్నారు. పంచాయతీ పనులను సకాలంలో చెల్లించి పంచాయతీ ఆదాయం పెంచాలని ఆయన కోరారు. మనుబోలు పంచాయితీలో ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టికి పెట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు .ఆయనతో పాటు పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రామాయపట్నం పోర్టు తరలిస్తే ప్రజా ఉద్యమాలు

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు

విశాలాంధ్ర-కందుకూరు: విభజన హామీల్లో భాగంగా రామాయ పట్నం దగ్గర నిర్మించాల్సిన బారీ నౌకా నిర్మాణం దుగ్గరాజు పట్నం తరలించే ప్రయత్నం విరమించుకోకపోతే ప్రజా ఉద్యమం చేపడ తామని సిపిఐ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం సిపిఐ కార్యాలయంలో నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం సహాయ కార్యదర్శి పి బాల కోటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు మాట్లాడుతూ రామాయపట్నంలోనే బారీ ఓడరేవు నిర్మాణం చేపడతామని అధికారానికి రాకముందు చంద్రబాబు కందుకూరు నియోజకవర్గం ప్రజలకు ఎన్నికల హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం అందిన తర్వాత నెల్లూరు నాయకుల ఒత్తిడితో భారీ నౌకా నిర్మాణ కేంద్రం దుగ్గరాజు పట్టణంలో నిర్మించే ప్రయత్నం జరుగుతున్నదని ఆయన తెలిపారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపితే రామాయపట్నం పోర్టు ప్రకాశం జిల్లాలోకి వెళుతుందన్న ఆలోచనతో నెల్లూరు నేతలు కందుకూరు ప్రకాశంలో కలిపేందుకు వ్యతిరేకిస్తున్నారని ఆయన ఆరోపించారు. సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పి బాల కోటయ్య మాట్లాడుతూ ఒకరిద్దరు రాజకీయ నేతలు తమ పొలాలు దుగరాజు పట్నం దగ్గర ఉండటంతో రేట్లు పెంచుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం అనైతికమని ఆయన అన్నారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్టీయూ రాష్ట్ర నేత వై అశోక్ బాబు మృతికి సమావేశం సంతాపం తెలిపింది. కార్యక్రమంలో ఎర్రం శెట్టి ఆనందమోహన్ చంద్రమోహన్ నత్త రామారావు ఆదినారాయణ లక్ష్మీనారాయణ ఉప్పుటూరు మాధవరావు నరసయ్య కోటేశ్వరరావు బాల బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ బాధితులకు అండ- ఎమ్మెల్సీపర్వత రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు 53వ డివిజన్ వెంకటేశ్వరపురం గాంధీ గిరిజన కాలనీలో డివిజన్ ఇన్ చార్జ్ వెంగళ్ రెడ్డి ఆధ్వర్యంలో , కోఆర్డినేటర్ పరంధామయ్య వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తల తో కలిసి మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న గిరిజన కుటుంబాలకు నిత్యవసర వస్తువులుముంపు ప్రాంత నిర్వాసితులు అయిన 200 మందికిభోజనాలనువైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీపర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా బాధితులకు వైసీపీ అండగా ఉంటుందన్నారు.నెల్లూరు 53వ డివిజన్‌లో మొంథా తుఫాన్ బాధితులకు నిత్యవసరసరుకులు, భోజనాలు అందజేశారు.ప్రభుత్వం కూడా బాధితులకు. అండగా నిలిచి వారి సమస్యలకు.శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెర్నెటి కోటేశ్వర రెడ్డి, డివిజన్ నేతలు ప్రసన్న కుమార్,శరత్,54 వైసిపి నేతలు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చు

విశాలాంధ్రబ్యూరోనెల్లూరు:ప్రతీ స్త్రీ తన వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతీ రోజూ ఒక్క క్షణం సమయం కేటాయిస్తేఎన్నోప్రమాదకరమైన వ్యాధుల నుండి బయటపడి ఆనందకరమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.వి.వి. ప్రసాద్ రెడ్డి, ఆంకాలజిస్ట్ డాక్టర్ హరిత, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ సూచించారు. ప్రధానంగా రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా సులభంగా గుర్తించవచ్చునన్నారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన మాస కార్యక్రమంలో భాగంగా నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ లో మహిళలకు ప్రత్యేకంగా రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.వి.వి. ప్రసాద్, ఆంకాలజిస్ట్ డాక్టర్ హరిత, యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వి.వి. ప్రసాద్ రెడ్డి, డాక్టర్ హరిత, డాక్టర్ శ్రీరామ్ సతీష్ మాట్లాడుతూ ఈ అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా జరుపుకుంటున్నామన్నారు. అందులో భాగంగా అనేకఅవగాహన కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. ప్రధానంగా నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ లో" చెక్ - ఓలేట్ " (చాక్లెట్) పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతీ స్త్రీ తన వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతీ రోజూ ఒక్క క్షణం సమయం కేటాయిస్తే వారి జీవితం చాక్లెట్ కంటే తీయగా ఉంటుందన్న అర్థంతో " చెక్ - ఓలేట్ " కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.